# భాగ్యనగరిలో 'గేమ్ ఛేంజర్'

**రామ్‌చరణ్** కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదల చేయబోతున్నారు. 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. గురువారం నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. త్వరలో రామ్‌చరణ్ ఈ షెడ్యూల్‌లో జాయిన్ కాబోతున్నారు. సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలను చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్‌చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు–శిరీష్, దర్శకత్వం: శంకర్.





# నా కల నెరవేరింది

'బబుల్‌గమ్' చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్నాడు రోషన్ కనకాల. రవికాంత్ పేరేపు దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం రోషన్ కనకాల పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'చిన్ననాటి నుంచే నటుడు కావాలనే కోరిక ఉండేది. నా కల ఈ సినిమాతో నెరవేరింది. నా బాల్యమంతా తాతగారి యాక్టింగ్ ఇనిస్టిట్యూట్‌లో గడిచింది. దాంతో తెలియకుండానే నటనపై మక్కువ పెరిగింది. లాస్‌ఏంజెల్స్, పాండిచ్చేరిలలో నటనకు సంబంధించిన శిక్షణ తీసుకున్నా. 'బబుల్‌గమ్' సినిమా కోసం షూటింగ్‌కు ముందే వర్క్‌షాప్ నిర్వహించారు. ఇది నా ఏజ్‌గ్రూప్‌కు సంబంధించిన కథ. దాంతో సహజమైన నటనను కనబరిచే అవకాశం దొరికింది. దర్శకుడి సలహాలు కూడా నటన విషయంలో బాగా హెల్ప్ అయ్యాయి. ఈ సినిమా కంటెంట్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. అందుకే విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిరంజీవి, నాగార్జున వంటి అగ్ర హీరోలను కలవడం, వారి సలహాలు తీసుకోవడం గొప్ప అనుభూతిని అందించింది. మా అమ్మనాన్నకు ఈ సినిమా బాగా నచ్చింది. కొన్ని సీన్స్ చూసి నాన్న ఏడ్చారని అమ్మ నాతో చెప్పింది. ఈ సినిమాలో షర్ట్‌లెస్ సీన్ హైలైట్‌గా ఉంటుంది. ఆ సీన్‌కోసం సిటీ మొత్తం మూడుగంటల పాటు షర్ట్ లేకుండా తిరిగాను. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ నటుడిగా నా ప్రతిభను చాటుకోవాలనుంది' అన్నారు.


రోషన్ కనకాల

# వినూత్న ప్రేమకథా చిత్రంలో..

**'బేబీ'** సినిమాతో యువతరంలో మంచి గుర్తింపును సంపాదించుకుంది కథానాయిక వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఈ భామ ప్రముఖ నిర్మాణ సంస్థ దిల్ రాజు ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న తాజా చిత్రంలో కథానాయికగా ఎంపికైంది. వివరాల్లోకి వెళితే..'బలగం' వంటి చక్కటి కథాబలం ఉన్న చిత్రాన్ని నిర్మించిన దిల్‌రాజు ప్రొడక్షన్స్ ప్రస్తుతం సరికొత్త కాన్సెప్ట్‌లతో సినిమాలను రూపొందిస్తున్నది. ఈ కోవలో ఆశిష్ హీరోగా అరుణ్ భీమవరపు దర్శకత్వంలో ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వైష్ణవి చైతన్యను కథానాయికగా ఖరారు చేశారు. వైవిధ్యభరితమైన ప్రేమకథా చిత్రమిదని, ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: పీసీ శ్రీరామ్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఆర్ట్: అవినాష్ కొల్ల, దర్శకత్వం: అరుణ్ భీమవరపు.

# పోలీస్ పాత్రలకు కేరాఫ్ కెప్టెన్



సుప్రసిద్ధ తమిళ సినీనటుడు, 'దేసియ ముర్పోక్కు ద్రవిడ కజగం'(డీఎండీకె) రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, తమిళనాడు మాజీ శాసనసభ్యుడు విజయకాంత్(71) గురువారం చెన్నయ్‌లో తుదిశ్వాస విడిచారు. అనారోగ్య కారణాల దృష్ట్యా గత నెలలో ఆయనను చెన్నయ్ మనప్పాకంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. నెలరోజులుగా అక్కడే చికిత్స తీసుకుంటున్న విజయ్‌కాంత్ గురువారం కన్నుమూశారు. తమిళనాట అగ్ర కథానాయకుడిగా పేరు పొందిన విజయ్‌కాంత్ 150కిపైగా చిత్రాల్లో నటించారు. అందులో ఇరవైకి పైగా చిత్రాల్లో పోలీస్ అధికారిగా ప్రేక్షకుల్ని మెప్పించారు.

**విజయ్‌కాంత్** 1952 ఆగస్ట్ 25న తమిళనాడులో మధురైలో జన్మించారు. ఆయన అసలు పేరు నారాయణన్ విజయరాజ్ అళగర్‌స్వామి. విజయ్‌కాంత్‌కు భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. 27 ఏండ్ల వయసులో విజయకాంత్ తెరంగేట్రం చేశారు.

'ఇనిక్కుమ్ ఇలమై'(1979) చిత్రంలో నటుడిగా పరిచయమైన ఆయన ఎన్నో అద్భుతమైన పాత్రలతో తమిళ ప్రేక్షకులను అలరించారు. ఆయన్ను అభిమానులు 'పురచ్చి కలింజర్' (విప్లవ కళాకారుడు) అని ప్రేమతో పిలుచుకునేవారు. 'కెప్టెన్ ప్రభాకరన్' సినిమా నుంచి ఆయన్ను అభిమానులు 'కెప్టెన్' అని అభిమానంతో పిలుచుకునేవారు. తమిళంలో దాదాపు 150 పైచిలుకు చిత్రాల్లో నటించిన విజయకాంత్‌ని తెలుగు ప్రేక్షకులు కూడా ఎంతో అభిమానిస్తారు. ఆయన నటించిన ఎన్నో చిత్రాలు తెలుగులో అనువాదమై అఖండ విజయాలు చవిచూశాయి. విజయకాంత్ హీరోగా, సత్యరాజ్ విలన్‌గా తమిళంలో రూపొందిన 'నూరవత్తునాళ్' చిత్రం 'నూరవరోజు' (1984) పేరుతో తెలుగులో విడుదలై అద్భుతమైన విజయాన్ని సాధించింది. అలాగే ఆయన తమిళంలో నటించిన 'సింధూర పువ్వే'(1988) కూడా 'సింధూరపువ్వు'గా తెలుగులో విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. తెలుగులో విజయ్‌కాంత్‌కి స్టార్‌డమ్ తెచ్చిన సినిమా 'పోలీస్ అధికారి'(1990). ఈ సినిమాతో తెలుగులో కూడా ఆయనకు మార్కెట్ గణనీయంగా పెరిగింది. కమల్‌హాసన్ తర్వాత తెలుగులో అధిక మార్కెట్ గల హీరోగా విజయ్‌కాంత్ ఎదిగారు.

## 'కెప్టెన్ ప్రభాకర్' ఓ సంచలనం

ఆయన హీరోగా సెల్వమణి దర్శకత్వంలో రూపొందిన 'కెప్టెన్ ప్రభాకర్'(1991) దక్షిణ భారత చలనచిత్రచరిత్రలో ఓ సంచలనం. అప్పట్లో ఆ సినిమాను 'సౌత్ ఇండియన్ షోలే'గా అభివర్ణించారు. ఆయన స్టైల్స్, ఫైట్స్ అంటే తమిళ తంబీలకు పిచ్చి. తమిళనటుడు శరత్‌కుమార్‌ని స్టార్‌హీరోగా నిలబెట్టింది కూడా విజయకాంతే. ఆయన నిర్మించిన 'మరో యుద్ధకాండ' చిత్రంతో శరత్‌కుమార్ హీరోగా మారారు. ఆ సినిమా తమిళంతోపాటు తెలుగులోనూ బాగా ఆడి, శరత్‌కుమార్‌కి కూడా తెలుగులో మార్కెట్ పెరిగేలా చేసింది. విజయకాంత్ 'విరుధగిరి' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. వల్లారసు, నరసింహ, సగప్తం అనే సినిమాలను నిర్మించారు. తమిళ ఇండస్ట్రీలో ఒకానొక దశలో రజనీకాంత్, కమల్‌హాసన్‌లకు గట్టి పోటీనిచ్చారు. విజయకాంత్. 1994లో 'తమిళనాడు స్టేట్ ఫిల్మ్ హానరరీ అవార్డు' (ఎంజీఆర్ పురస్కారం), 2001లో 'కళైమామణి అవార్డు' అందుకున్నారు. వీటితో పాటు పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలను గెలుచుకున్నారు.

## రాజకీయ రంగ ప్రవేశం..

తమిళ చిత్రసీమలో నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా ఓ వెలుగు వెలిగిన విజయ్‌కాంత్.. తదనంతరం 2005లో డీఎండీకే అనే రాజకీయపార్టీని స్థాపించారు. అయితే, శాసనసభ్యునిగా రెండుసార్లు విజయం సాధించగలిగారు కానీ, పార్టీని మాత్రం అధికారంలోకి తీసుకురాలేకపోయారు. తమిళనాట కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న విజయ్‌కాంత్ మరణం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు.



# ముగ్గురు మిత్రుల 'కిస్మత్'

నరేష్ ఆగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వదేవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కిస్మత్'. అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీనాథ్ బాదినేని దర్శకుడు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగే చిత్రమిది. చిన్ననాటి మిత్రులైన ముగ్గురు యువకుల జీవితం చుట్టూ కథ నడుస్తుంది. వారి జీవితాల్లో ఎదురైన అనూహ్య పరిణామాలేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. న్యూఏజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: మార్క్ కె రాబిన్, నిర్మాణ సంస్థ: కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్, నిర్మాత: రాజు, దర్శకత్వం: శ్రీనాథ్ బాదినేని.


యువచంద్ర, అనన్య నాగళ్ల

# గ్రామీణ నేపథ్యంలో పొట్టేల్

యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. సురేశ్‌కుమార్ సడిగే, నిశాంత్ నిర్మాతలు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్ ద్వారా టైటిల్‌ని లాంచ్ చేశారు. గ్రామీణ వాతావరణానికి చెందిన సంప్రదాయాలు, విశ్వాసాల సమాహారంగా మోషన్‌పోస్టర్ ఉంది. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రణయ్‌రెడ్డి వంగా మాట్లాడుతూ 'మంచి కథని చూపించటానికి టీమ్ మొత్తం ఎంత కష్టపడ్డారో కళ్లతోనే చూశాను. నటీనటుల నటనే కాదు, సాంకేతికంగా కూడా గొప్పగా ఉంటుంది సినిమా' అని చెప్పారు. కొన్నేళ్లపాటు గుర్తుండిపోయే సినిమా ఇదని అనన్య నాగళ్ల అన్నారు. వినోదం, సందేశం మిళితమైన కథతో ఈ చిత్రం రూపొందిందని యువచంద్ర కృష్ణ చెప్పారు. కథ రాసేటప్పుడు ఉన్న ఎమోషన్స్ ఇంకా తనలో అలాగే ఉన్నాయని, వరంగా వచ్చిన ఆలోచనే ఈ కథ అని దర్శకుడు తెలిపారు. ఇంకా నిర్మాతలు కూడా మాట్లాడారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్‌సేన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, కెమెరా: మోనిష్ భూపతిరాజు.







